క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్: ఈ నెల 19న అరుణాచలం గిరి ప్రదక్షిణకు కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం మైనొద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులు 18వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు కదిరి డిపో నుంచి బయల్దేరుతాయన్నారు. ఈ బస్సులు తొలుత కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న తర్వాత అరుణాచలం వెళ్తాయని పేర్కొన్నారు. నల్లచెరువు, తనకల్లు, ములకలచెరువుల్లో బోర్డింగ్ పాయింట్ కూడా ఉంటుందన్నారు. సూపర్ లగ్జరీలో చార్జీ రూ.1,300, ఎక్స్‌ప్రెస్‌లో రూ.1,050 ఉంటుదన్నారు. మరిన్ని వివరాలకు 99592 25892, 90525 37054 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలపై దృష్టి



ఎమ్మెల్యే సునీతకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కనగానపల్లి: ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మండల స్థాయి అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. భూ సమస్యలతో పాటు పింఛన్లు, రేషన్‌కార్డులు కావాలంటూ పలువురు వినతులు అందజేశారు. వీటితో పాటు తమ సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడాలని మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

ఎన్పీకుంట: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.రమేష్, అధ్యక్షుడిగా కె.మహమ్మద్ అలీ, ఉపాధ్యక్షురాలిగా ఎస్.రేఖ, సెక్రటరీగా వై.హరీష్, ట్రెజరర్‌గా ఎం.జహీర్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆధార్‌తో అప్‌డేట్ చేసుకోండి

ధర్మవరం రూరల్: సహకార సంఘంలోని సభ్యులు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని, లేకుంటే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని గొట్లూరు పీఏసీఎస్ సీఈఓ నారాయణస్వామి తెలిపారు.

ఈ–కేవైసీ చేయించుకోవాలి

నల్లచెరువు: మండల కేంద్రంలోని సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు ఆన్‌లైన్ ద్వారా ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సహకార సంఘం సీఈఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఆదుకున్న ‘ఆప్త మిత్రులు’

తనకల్లు: ఆరోగ్యం బాగలేక కష్టాల్లో ఉన్న మిత్రుడికి పలువురు ఆర్థికసాయంతో ఆదుకున్నారు. తనకల్లుకు చెందిన డి.రమేష్ ఇటీవల అనారోగ్యం బారినపడ్డాడు. బెంగళూరులోని జయదేవ్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్సకు డబ్బులేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసి తనతో కలిసి చదువుకున్న మిత్రులు స్పందించారు. మిత్రుడిని ఆదుకునేందుకు తలా ఒక చేయి వేశారు. అలా పోగు చేసిన రూ.50వేల నగదును రమేష్ కుటుంబానికి మంగళవారం అందజేశారు. బెంగళూరులోని మిత్రుడు చంద్రమోహన్ ఆస్పత్రి చైర్మన్‌తో మాట్లాడి రమేష్‌కు మెరుగైన వైద్యం అందేలా చొరవ చూపారు. కార్యక్రమంలో టీం భగత్‌సింగ్ సభ్యులు, పూర్వ విద్యార్థులు ఎం.యోగి, రాంబాబు, మస్తాన్, సురేంద్రరెడ్డి, విశ్వనాథ్, విజయ్ గాంధీ పాల్గొన్నారు.

ధర్మవరం కళాకారుల ప్రతిభ



వారణాసిలో అవార్డు అందుకున్న ధర్మవరం నాట్య కళాకారులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం నృత్య కళాకారులు అద్భుత నాట్య ప్రదర్శనతో అలరించారు. శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ, రామ లాలిత్యల ఆధ్వర్యంలో 27 మంది శిష్యులు ఈ నెల 11న వారణాసిలోని ఆంధ్రభవన్‌లో, 12న అయోధ్యలోని వైదేహి మందిర్‌లో శ్రీవాగ్దేవి వారు నిర్వహించిన నృత్యోత్సవాల్లో ప్రతిభ కనబరిచారు. వారణాసిలో శివగంగ అవార్డును ఎమ్మెల్యే శ్రీవాత్సవ, అయోధ్యలో బాలరామయ్య అవార్డును వల్లభస్వామీజీ చేతుల మీదుగా కళాకారులు అందుకున్నారు. నాట్య గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామలాలిత్యలకు నాట్య కౌముది, అయోధ్య రామ అవార్డులు అందించారు. 27 మంది శిష్యులకు శివగంగ అవార్డు, బాలరామయ్య అవార్డులతో సత్కరించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపన

తలుపుల : ఓబీఆర్ కొత్తపల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అలంకార వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించన్నారు. 1

గమ్యం చేరని మోడల్ బస్టాండ్

- ఆధునిక హంగులతో కదిరి బస్టాండ్‌కు ప్రతిపాదన
- పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయం
- 16 ప్లాట్‌ఫాంల ఏర్పాటుతో అత్యాధునిక హంగులు

అంతర్ జిల్లాలు, అంతర్ రాష్ట్రాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో కదిరి ఆర్టీసీ బస్టాండ్ నిత్యం కిటకిటలాడుతుంటుంది. అయితే రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ సేవలు అందడం లేదు. డిపో ఆధునీకరణ, ఆధునిక హంగులతో మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దాలని ఇదివరకే చేసిన ప్రతిపాదన ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. కూటమి సర్కారు ఆ దిశగా అడుగులు వేయాలని ప్రయాణికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కదిరి అర్బన్: నియోజకవర్గ కేంద్రం కదిరిలో 1978 మేలో ఆర్టీసీ డిపో – బస్టాండ్ ప్రారంభమైంది. 112 మంది సిబ్బందితో ఐదు ప్లాట్‌ఫాంల నుంచి 27 బస్సులు నడిపారు. అలా అంచలంచెలుగా విస్తరించింది. ప్రస్తుతం 110 బస్సులు, 476 మంది సిబ్బంది ప్రత్యక్షంగా, 1200 మంది పరోక్షంగా ఆర్టీసీ బస్టాండ్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. రోజూ కదిరి డిపో బస్సులు 550 ట్రిప్పులు, ఇతర డిపోల బస్సులు 450 ట్రిప్పులు కదిరి బస్టాండ్ గుండా దాదాపు 6,500 మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేస్తుంటాయి.

మోడల్ బస్టాండ్‌గా ఎంపిక

జిల్లాలో పెనుకొండతో పాటు కదిరి బస్టాండ్‌ను మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దాలని ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కదిరి బస్టాండ్‌లో వ్యాపారులు, బిల్డర్లతో జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్, సివిల్ ఇంజినీర్ సురేంద్రబాబులు సమావేశమయ్యారు. మోడల్ బస్టాండ్ ప్రతిపాదనలను వివరించారు. 16 ప్లాట్‌ఫాంలు, బస్టాండ్ పై అంతస్తులో డిపో మేనేజర్, కార్యాలయ భవనాలు ఏర్పాటు చేయనున్నారు. ప్లాట్‌ఫాంల విస్తరణతో ఏ రూటు బస్సులు ఎక్కడ నిలుస్తాయో ప్రయాణికులకు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ (పీపీపీ) పద్ధతిలో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకునే మోడల్ బస్టాండ్‌ను 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. లీజు వ్యవధి 58 ఏళ్లు ఇవ్వాలని బిల్డర్లు, వ్యాపారులు కోరారు. బస్టాండ్ నిర్మాణ ప్లాన్‌ను ఆర్టీసీ అధికారులే తయారు చేసివ్వాలని సూచించారు.



కదిరి ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారం



త్వరితగతిన పనులు చేయాలి



ప్రయాణికుల అభీష్టం మేరకు ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించేందుకు ఉన్నతాధికారులు ముందుకురావడం సంతోషంగా ఉంది. 45 ఏళ్ల కిందట ఏర్పాటైన బస్టాండ్ ఇప్పటి అవసరాలకు ఏమాత్రమూ సరిపోవడం లేదు. త్వరితగతిన బస్టాండ్‌ను ఆధునీకరించి.. ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలి.

– ఈశ్వర్‌రెడ్డి, కదిరి

ఆధునిక హంగులు కల్పించాలి



ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కదిరి బస్టాండ్‌ను విస్తరించాలి. పులివెందుల బస్టాండ్ తరహాలో ఆధునిక హంగులతో నిర్మిస్తే చాలా బాగుంటుంది. కదిరి బస్టాండ్‌కు కావలసినంత స్థలం ఉంది. ఉన్నతాధికారులు త్వరితగతిన మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దాలి.

– యుగంధర్‌రెడ్డి, ఎన్‌జీఓ కాలనీ

అనుమతి రాలేదు



మోడల్ బస్టాండ్ నిర్మాణానికి పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ (పీపీపీ) పద్ధతిలో ప్రతిపాదనలు తయారు చేశాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాలేదు. ప్రస్తుతం కదిరి డిపో బస్టాండ్‌లో కమర్షియల్ షాపుల ద్వారా నెలకు రూ. 8 లక్షల ఆదాయం వస్తోంది. ఈ మొత్తానికి పైబడి ఎవరైతే బిడ్డింగ్ వేస్తారో వారికే బస్టాండ్ నిర్మాణం అప్పగిస్తాం. నూతన టెక్నాలజీ, అన్ని హంగులతో బస్టాండ్ నిర్మించేందుకు సంస్థ దగ్గర తగినన్ని నిధులు లేవు. అందుకే పీపీపీ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించాం.

– మధుసూదన్, జిల్లా ప్రజారవాణా అధికారి

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



నల్లచెరువు పంచాయతీలోని సమస్యలను వివరిస్తున్న సర్పంచ్ పంచరత్నమ్మ

నల్లచెరువు: గ్రామాల్లోని ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీపీ రమణారెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శకుంతల, తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. నల్లచెరువులోని విజయలక్ష్మి కాలనీలో మురుగునీరు రోడ్లపై పారుతోందని, సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీలో పలు ఇళ్లలోకి మురుగు చేరిందని సర్పంచ్ పంచరత్నమ్మ తెలిపారు. ఓరువాయి రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద, పూలకుంటకు వెళ్లే రోడ్లు గుంతలు పడి వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. గుంతల వద్దే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.ఎం. లింగన్నతో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేయాలి

కదిరి టౌన్: ఆర్ఎంపీలు తమ సమస్యల పరిష్కారం కోసం కలసికట్టుగా పనిచేయాలని ఆర్ఎంపీల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఉన్న రిటైర్డు ఉద్యోగుల భవనంలో మంగళవారం ఆర్ఎంపీల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాలూకా అధ్యక్షుడు డాక్టర్ అల్లాబకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ మాట్లాడారు. నిబంధనల మేరకు ప్రథమ చికిత్స చేసి తమ వైద్య వృత్తి కొనసాగించాలని ఆర్ఎంపీలకు సూచించారు. అనంతరం ఆర్ఎంపీల అసోసియేషన్ సభ్యులకు మెంబర్‌షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్మ, అబ్దుల్ కరీం, బాబా ఖలందర్, సభ్యులు ఆంజనేయులు, వేమారెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీకి చెందిన షబ్బీర్‌పై స్నేహితుడు దాడి చేసి గాయపరిచాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మశానంపేటకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ రఫిక్, నిజాంవలి కాలనీకి చెందిన షబ్బీర్ ఇద్దరూ స్నేహితులు. మంగళవారం రాత్రి ఇద్దరూ మద్యం తాగారు. తన వద్ద తీసుకున్న అప్పును చెల్లించాలని షబ్బీర్‌ను రఫిక్ అడిగారు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో రఫిక్ చెక్కతో షబ్బీర్ తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. షబ్బీర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

21న పరుగు పందేలు

పుట్టపర్తి అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల బాలికలకు పరుగు పందేలు నిర్వహించనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అండర్– 14, అండర్ – 17 విభాగాల్లో పరుగు పందేలు ఉంటాయన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

నల్లచెరువు: పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు, పంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ నసీమ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

సన్మానం

నల్లచెరువు: పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తలమర్ల వాండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడుని మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో మంగళవారం చెత్తనుంచి సంపద తయారీపై ఎంపీడీఓ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులకు చెత్త తరలించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా డంపింగ్ యార్డులకు తరలించాలని పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి సూచించారు. సర్పంచులకు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా కప్పలబండ డంపింగ్ యార్డు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి వ్యాధులూ దరిచేరవన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను రోడ్డుపై వేసి కాల్చరాదన్నారు. అలా చేస్తే మరిన్ని వ్యాధులు ప్రబలుతాయన్నారు. డంపింగ్ యార్డులకు తరలించిన చెత్త నుంచి సంపద తయారు చేయొచ్చన్నారు. దాన్ని విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి నాటికి అన్ని డంపింగ్ యార్డులు అందుబాటులోకి రావాలన్నారు. చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు.

ముంచెత్తిన వర్షాలు



ధర్మవరం శ్రీదేవి థియేటర్ వీధిలో వర్షపు నీటిలో మునిగిన ద్విచక్రవాహనాలు



తనకల్లు మండలం నల్లగుట్లపల్లిలోని ఓ ఇంట్లో వర్షానికి తడిసిన వస్తువులు ఆరబెట్టిన దృశ్యం



నల్లచెరువు ఆస్పత్రిలో నిలిచిన వర్షపు నీరు

ధర్మవరం/ ధర్మవరం అర్బన్/ కదిరి అర్బన్/ తనకల్లు: ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వరకు వర్షాలు ముంచెత్తాయి. ధర్మవరంలో అత్యధిక వర్షపాతం నమోదైందని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ఏఎస్ఓ గోపాల్ తెలిపారు. ధర్మవరంలో 62.4 మిమీ, చెన్నేకొత్తపల్లిలో 42.2, రామగిరిలో 46.4, కనగానపల్లిలో 4.6 మి.మీ నమోదైనట్లు వివరించారు. వర్షాలు మరో రెండురోజులు కురిసే సూచనలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ సూచించారు.

- ధర్మవరం పట్టణంలో కుండపోత వర్షానికి ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. పలు వీధుల్లో ద్విచక్రవాహనాలు సైతం నీట మునిగాయి. పలు వార్డుల్లో చెట్లు కూలిపోయాయి. తొగటవీధి, శ్రీదేవి థియేటర్ వీధుల్లోని లోతట్టు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీటితోపాటు డ్రెయినేజీ రహదారి పైకి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.
- కదిరి మండలం మల్లయ్యగారిపల్లి తండాలో కురిసిన వర్షానికి నాగేనాయక్‌కు చెందిన 17 గొర్రెలు నీటమునిగి చనిపోయాయి. ఇళ్లలోకి సైతం మోకాలిలోతు నీళ్లురావడంతో తిండిగింజలు, నిత్యావసరాలు తడిచిపోయాయి. ఊరికి ఆనుకుని ఉన్న వంకలో వరద ఉధృతంగా ఉండటంతో సమీపంలోని ఇళ్లల్లోకి నీరు చేరింది. కారెడ్డిపల్లి తండా వద్ద వర్షపునీటి ప్రవాహానికి కల్వర్టు కొట్టుకుపోయింది. మల్లయ్యగారిపల్లిలో బాధిత కుటుంబాలను ఆర్డీఓ వంశీకృష్ణ పరామర్శించారు. 17 గొర్రెలు రూ.2.25 లక్షలు విలువ చేస్తాయని వెటర్నరీ డాక్టర్ గంగాభవాని నివేదిక తయారు చేశారు. కదిరి మండలంలో 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.
- తనకల్లు మండలంలో 94.6 మి.మీ వర్షం కురిసింది. నల్లగుట్లపల్లిలో దాదాపు 20 ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, దుస్తులు తడిచిపోయాయి. చీకటిమానిపల్లిలో భజనమ్మ, శ్రీకంఠంకు చెందిన పూరిల్లు నేలమట్టమైంది. చిన్నపల్లిలో రెడ్డెప్పకుంట తెగిపోయింది. మబ్బువారిపల్లి వండమనేరు బ్రిడ్జిపై విద్యుత్ స్తంభాలు దారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. చిన్నపల్లిలో చెరువు తెగినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా ‘విభజన కష్టాల స్మృతి దివస్’



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ సిటిజన్

ప్రశాంతి నిలయం: ప్రధాని మోదీ పిలుపు మేరకు పుట్టపర్తిలోని కెనరా బ్యాంక్ శాఖలో దేశ విభజన భయానకాల స్మారక దినోత్సవం (విభజన కష్టాల స్మృతిదివస్)ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేశ విభజన సమయంలో భారత్ ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను నేటి తరానికి వివరించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మాజీ సైనికులు కల్నల్ సుందర్, సీనియర్ సిటిజన్లు మురళీ రామస్వామి, గుడిపూడి యుగంధర్ ముఖ్య అతిథులుగా హాజరై ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం రమణకుమార్ మాట్లాడుతూ దాదాపు 200 సంవత్సరాల పాటు తమ కబంధహస్తాలలో భారతదేశ ప్రజలను నలిపేసిన ఆంగ్లేయులు, దేశం విడిచిపోతూ రెండుగా విడగొట్టారన్నారు. స్వాతంత్ర్యం రావడానికి రెండు గంటల ముందు భారత్–పాకిస్తాన్ అని రెండు ముక్కలు చేశారన్నారు. విభజన సమయంలో జరిగిన అల్లర్లలో లక్షలాది మంది ఊచకోతలకు గురయ్యారన్నారు.

ముదిగుబ్బలో బైక్ ర్యాలీ

ముదిగుబ్బ: హర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం ముదిగుబ్బలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కుల్లాయప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ హాజరయ్యారు. ఎంపీపీ ఆదినారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అజేష్ యాదవ్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం నియంత్రించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ కమిషనర్

కదిరి టౌన్: కర్ణాటక నుంచి మన ప్రాంతంలోకి అక్రమంగా మద్యం రాకుండా నియంత్రించాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కదిరి సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ నాగేంద్రమ్మ, ఎస్ఐ అహ్మద్ అలీ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: కర్ణాటక మద్యం సరఫరా కాకుండా గట్టి నిఘా ఉంచాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలను సెబ్ సీఐ లలితాదేవితో అడిగి తెలుసుకున్నారు.

ధర్మవరం అర్బన్: అక్రమంగా మద్యం, గంజాయి, నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ హెచ్చరించారు. పట్టణంలోని సెబ్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెబ్ సీఐ గురుప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే అథ్లెటిక్స్ మీట్



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రీజనల్ డైరెక్టర్ ప్రమీల

ధర్మవరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీలలో ధర్మవరం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గ్రామీణ బాలికలు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బాలికలు అనంతపురంలో జరిగే కేంద్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ, అనిల్, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ధనుంజయ

తనకల్లు: పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఎం.ధనుంజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనకల్లులో మంగళవారం కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడి కృష్ణమూర్తిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్.బాబ్‌జాన్, కోశాధికారిగా చంద్రమోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శులుగా శ్యాంకుమార్, మోహసీనాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

9 స్కూల్ బస్సులపై కేసులు

కదిరి అర్బన్: పట్టణంలో పలు ప్రవేట్ విద్యాసంస్థల బస్సులను మంగళవారం ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్ తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని 9 వాహనాలపై కేసులు నమోదు చేసి, రూ.75 వేల అపరాధ రుసుం విధించారు. మూడు వాహనాల డ్రైవర్లకు లైసెన్సులు లేనట్లు, రెండు వాహనాలకు ట్యాక్స్ కట్టనట్లు, నాలుగు వాహనాలు అధికలోడ్‌తో తిప్పుతున్నట్లు గుర్తించారు. స్కూల్ బస్సులు తప్పనిసరిగా రవాణాశాఖ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు.

వర్షం కోసం సత్యమ్మకు బోనాలు

తలుపుల : మూలపల్లిలో వర్షం కురవాలని గ్రామస్తులు మంగళవారం సత్యమ్మకు బోనాలు పట్టారు. తొలుత ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాల గంపలు ఎత్తుకొని తప్పెట్లతో ఊరేగింపుగా వచ్చి సత్యమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సమర్పించారు. వర్షం కురిపించి గ్రామం సశ్యశ్యామలంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకొన్నారు.

జాతీయభావం పెంపొందాలి



బుక్కపట్నంలో ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది

పుట్టపర్తి అర్బన్/ నల్లమాడ/ పుట్టపర్తి: ప్రతి ఒక్కరిలో జాతీయభావం పెంపొందాలని ఏపీఎం లలిత, లక్ష్మీనారాయణలు పిలుపునిచ్చారు. మంగళవారం పుట్టపర్తి మండలం పెడపల్లిలో మహిళలతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉన్నత పాఠశాల వరకు హర్ ఘర్ తిరంగా పేరిట త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, చౌడయ్య, రామేశ్వరమ్మ, గ్రామ సంఘ సహాయకులు వసంతమ్మ, సరస్వతీ బాయి, భారతి, తేజ, తదితరులు ఉన్నారు. నల్లమాడలోనూ వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. బుక్కపట్నంలో పీడీ నరసయ్య ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు.

న్యాయం చేయండి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని సైదాపురం గ్రామ పొలం సర్వే నంబర్ 54–1ఏ2లో 0.06, 54–1బి2లో 0.04 సెంట్లుపైకి 0.07 సెంట్లు హక్కుదారులైన బండారు రవికిషోర్, బయన బోయిన రవీంద్ర, జనార్దన్‌తో 36వ వార్డు కౌన్సిలర్ వెంకటగిరి ఆవేంద్ర కొనుగోలు చేసి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే టీడీపీ నాయకుడు పి.సురేష్‌బాబు ఇదే స్థలానికి సంబంధించి బోగస్ పత్రాలు సృష్టించి కబ్జా చేయాలని చూస్తున్నారని, విచారణ చేసి, డాక్యుమెంట్లు పరిశీలించి తమకు న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను కౌన్సిలర్ కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.